క్లుప్తంగా

ముగిసిన పవిత్రోత్సవాలు


అమ్మవారిని కలువపూలతో అలంకరించిన దృశ్యం

దాబాగార్డెన్స్: గత 3 రోజులుగా కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం 8 నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్ర ఆవరోహణం, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం జరిపారు. దేవస్థాన వేదపండితులు, అర్చకుల పర్యవేక్షణలో పవిత్రోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న మహాదేవ గణపతి విగ్రహం


పూజలందుకుంటున్న మహాదేవ గణపతి

అల్లిపురం: యాతపేటలో ఏర్పాటు చేసిన మహాదేవ వినాయకుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. నడుముకు పులిచర్మం ధరించి, త్రిశూలధారుడిగా చూడగానే చెయ్యెత్తి నమస్కరించేలా స్థానిక యువత ఈ వినాయక ప్రతిమను ఏర్పాటు చేశారు.

కాంట్రాక్ట్ కార్మికుల పోరుబాటు


ఐక్యత చాటుతున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో పోరుబాట పట్టారు. అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఎల్ఎంఎం పార్కులో సమావేశమైన నాయకులు ఉద్యమంపై చర్చించారు. కాంట్రాక్ట్ కార్మికుల అటెండెన్స్ గేట్లు వద్ద ఉన్న బయోమెట్రిక్ మిషన్ల ద్వారా కాకుండా విభాగాల్లో హాజరు ఇవ్వాలని, జీతాల కోత విధించే నిర్ణయం ఉపసంహరించాలని, బయోమెట్రిక్ పేరిట ఏ కార్మికుడిని నిలుపుదల చేసినా అంగీకరించబోమన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల ఫైనల్ చెల్లింపులో కోత విధించరాదని, స్కిల్డ్ కార్మికులకు ఈఎస్ఐ బదులు ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి రవి, పిట్టా రెడ్డి, పి. భాస్కరరావు, ఉరుకూటి అప్పారావు, ధర్మాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25వ వార్డులో పడకేసిన పారిశుధ్యం


సీతంపేట రెల్లి వీధిలో పేరుకుపోయిన చెత్త

సీతంపేట : అధికారుల పర్యవేక్షణ లోపంతో వార్డుల్లో పారిశుధ్యం నిర్వహణ గాడి తప్పింది. జీవీఎంసీ 25వ వార్డులో ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వీధుల్లో చెత్త కుప్పలు రోత పుట్టిస్తున్నాయి. కనకమ్మ ఆలయం నుంచి రెల్లి వీధికి వెళ్లే మార్గంలో చెత్త, వ్యర్థాలు డంపర్‌బిన్ చుట్టూ చెల్లాచెదురుగా పోగుపడి అటుగా వెళ్లే వారికి రోత పుట్టిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డులో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తరాలు చూసిన తరువులు


రైల్వే క్వార్టర్స్‌లోని పురాతన ఊడల మర్రి


కుమ్మరవీధి జెండా చెట్టు వద్ద..


సెయింట్ ఆంథోనీ హైస్కూల్ ప్రాంగణంలో వందేళ్లు పైబడిన మర్రిచెట్టు


రైల్వే క్వార్టర్స్‌లో వందేళ్లు పైబడిన చెట్టు


రైల్వేస్టేషన్ రోడ్డులోని డివిజనల్ కార్యాలయం ఫ్లైఓవర్ వద్ద వందేళ్లు పైబడిన వృక్షం

- నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో వందేళ్లు పైబడ్డ వృక్షాలు
- పెనుగాలులు, తుపాన్లను తట్టుకుని నిలబడ్డ హరిత కుడ్యాలు
- పూర్వీకులు మనకిచ్చిన హరిత బహుమతులను కనులారా వీక్షించండి

దాబాగార్డెన్స్: శతమానం భవతి అని ఆశీర్వదిస్తారు పెద్దలు. నూరేళ్లూ నిండుగా జీవించాలని ఆకాంక్షిస్తారు. అయితే రాళ్లూరప్పలు కూడా వందల ఏళ్లు మనుగడ సాగిస్తాయి. గుర్తింపు లేకుండా పడి ఉంటాయి. అలా ఉండటం వల్ల ఏం లాభం ఉంది? పది మందికి నీడనిచ్చే చెట్టులా పచ్చగా పదికాలాలు బతకడంలో ఓ ప్రయోజనం ఉంది. అలా వందేళ్ల పైబడి జీవిస్తూ.. వేలాది పక్షులకు నీడనిస్తూ.. తమ చెంతకొచ్చే వారికి చల్లదనాన్ని పంచుతూ జన్మను చరితార్థం చేసుకున్న వృక్షాలు నియోజకవర్గంలో చాలా ఉన్నాయి. కాంక్రీట్ జంగిల్ విస్తీర్ణం పెరుగుతూ.. అక్కడక్కడ ఉన్న చెట్లు కూడా మనిషి స్వార్థం గొడ్డలి వేటు కారణంగా నేల కొరుగుతున్న ఈ కాలంలో ఇలాంటి వృక్షాలు పచ్చని ఆశకు ప్రతిబింబాల్లా సగర్వంగా నిల్చొని ఉన్నాయి. వాటి జీవిత కాలంలో ఎన్ని పెనుగాలులను చూశాయో.. ఎన్ని తుపాన్లను తట్టుకున్నాయో.. ఇప్పటికీ సిటీ ఆటుపోట్లను అధిగమించి గొప్పగా నిలబడ్డాయి. ఆకాశం వంక ఆకు పచ్చని చేతులు చాచి వాన చినుకులను స్వాగతిస్తూ.. **పుడమిపై హరిత తోరణాలు కట్టి సమాజహితం కాంక్షించే పెద్దల్లా హుందాగా మనుగడ సాగిస్తున్నాయి. అందరినీ చల్లగా బతకమని ఆశీర్వదిస్తున్నాయి. వన దేవతల్లాంటి ఈ తరువులు ఏనాడో మన పూర్వీకులెవరో నాటారు. వాటిని దర్శిం**చుకుని గతించిన ఆ మహనీయుల ఆశీర్వచనాలు పొందుదాం. ఎప్పుడైనా రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రయాణిస్తే.. డీఆర్ఎం కార్యాలయం చేరువకు వెళ్తే రోడ్డుపైకి వ్యాపించిన మహా వటవృక్షాన్ని తల పైకెత్తి చూడండి. మీ హడావుడిని లిప్త పాటు పక్కన పెట్టి 135 ఏళ్ల ఆ మహా తరువును ఒక్కసారి కనులారా వీక్షించండి. ఆ చల్లని పవనాలను మనసులో నింపుకుని ముందుకు సాగిపోండి. అల్లిపురం వేంకటేశ్వర మెట్ట దగ్గర స్వామిని దర్శించుకుని ప్రణమిల్లడమే కాదు.. చెంతనే ఉన్న శతాయుష్మలా గంభీరంగా నిల్చొని ఉన్న సమున్నత తరువు చేరువలో సాంత్వన పొందండి. అంతే కాదు సెయింట్ ఆంథోనీ చర్చి చేరువలో.. హైస్కూల్ చెంతన కరుణామయిలా నిల్చున్న మర్రి నీడలో మనస్సు తేలిక చేసుకోండి. బీచ్‌రోడ్డులో రామకృష్ణ మఠం సమీపాన ధ్యానముద్రలో ఉన్న మూడు మహావృక్షాలకు మొక్కి జీవన పరమార్థం జాడ తెలుసుకోండి. ఆ వృక్షాల స్ఫూర్తితో పది కాలాలు పచ్చగా పదిమందికి పనికొచ్చేలా వర్ధిల్లండి.


ఆంధ్రా మెడికల్ కళాశాల అనాటమీ విభాగం వద్ద వందేళ్ల నాటి మర్రిచెట్టు

వెంకటేశ్వరమెట్టపై పగలే వెలుగులు


వెంకటేశ్వరమెట్టపై పగలు కూడా వెలుగుతున్న వీధి దీపాలు

అల్లిపురం: జీవీఎంసీ విద్యుత్ విభాగం ఉద్యోగుల పనితీరు అయితే అతివృష్టి లేకపోతే అనావృష్టి అన్నట్లుగా ఉందని వెంకటేశ్వరమెట్ట వాసులు వాపోతున్నారు. వీధి దీపాలు వెలగకపోతే వారాల కొద్దీ వెలగవని, వెలిగితే నిరంతరం వెలుగుతూనే ఉంటాయని ఆరోపిస్తున్నారు. వెంకటేశ్వర మెట్టపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో గత వారం రోజులుగా విద్యుత్ దీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. ఎస్ఎస్ 11పై వీధి దీపాలు గత వారం రోజులుగా నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయని, వాటిని నియంత్రించే ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

కొనసాగుతున్న నర్సుల నిరసనలు


కేజీహెచ్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

మహారాణిపేట: జీవో 115ను రద్దు చేయాలని కోరుతూ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు చేస్తున్న ఆందోళన 11వ రోజుకు చేరుకుంది. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట వారు సోమవారం కూడా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏపీ నర్సుల స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో గత పది రోజుల నుంచి వారు ఆందోళన చేస్తున్నారు. కాంట్రాక్టు నర్సులు జీఎన్ఎం, బీఎస్ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్ చదవి ఇప్పటికే ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్నవారు ఉన్నారని, తమను రెగ్యులర్ చేయకుండా ఇతరులకు పదోన్నతులు కల్పించవద్దని నర్సులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో

ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు


డ్యాన్స్‌లతో అలరించిన విద్యార్థులు

దాబాగార్డెన్స్: శ్రీకాశ్యప్ డిగ్రీ కళాశాల నూతన విద్యార్థుల ఆహ్వాన కార్యక్రమం సోమవారం ఉల్లాసంగా సాగింది. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో భాగంగా సీనియర్ విద్యార్థులు చేసిన వినోద, సంగీత కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ టీఆర్ఎస్ వర్మ మాట్లాడుతూ కళాశాలలో అత్యుత్తమ అధ్యాపకులు, మౌలిక వసతులు ఉన్నందున విద్యార్థుల భవిష్యత్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రిన్సిపాల్ నారాయణమూర్తి మాట్లాడుతూ కళాశాల క్రీడలకు మద్దతు ఇస్తుందని, విద్యార్థుల శారీరక ఎదుగుదలకు ఇండోర్, ఔట్‌డోర్ క్రీడా సౌకర్యాలు కలిగి ఉందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నాటికలు, జానపద నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రిని ప్రైవేట్‌కు కట్టబెట్టొద్దు

- సిటు నేతల డిమాండ్
- 19న నల్లబ్యాడ్జీలతో నిరసన
- 24న ఏవోబీ వద్ద ఒక రోజు ధర్నా
- అక్టోబర్ 1 నుంచి రిలే నిరాహార దీక్షలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

దాబాగార్డెన్స్: పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని ప్రైవేట్‌కు కట్టబెట్టొద్దని, పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సిటు డిమాండ్ చేసింది. విశాఖ పోర్టు ఆస్పత్రిని పీపీపీకి ఇవ్వాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ నిరసనకు సంబంధించిన పోస్టర్‌ను యూనియన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి బి.జగన్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని సాలిగ్రామపురంలో 1984లో 150 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగా నడుస్తోందన్నారు. పోర్టు అండ్ డాక్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, రిటైర్ అయిన కార్మికులు, ఫ్యామిలీ పెన్షనర్లు, పూల్ కలాశీలు, సీహెచ్‌డీ క్యాజువల్ కార్మికులతో పాటు సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు 35 వేల కుటుంబాలకు దశాబ్దాల తరబడి సేవలందిస్తుందన్నారు. అటువంటి పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా 300 పడకలతో ప్రైవేట్ వారికి ఇచ్చేయాలనే నిర్ణయం దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయాన్ని సిటు వ్యతిరేకిస్తుందన్నారు. పోర్టులో పీపీపీ/ఓటీటీ విధానాలు విఫలమయ్యాయని, గతంలో స్వయంగా కాగ్ మొట్టికాయలు వేసిన సంగతిని గుర్తు చేశారు. పీపీపీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేపడుతున్నామని, దీనిలో భాగంగా 19న నల్లబ్యాడ్జీలతో నిరసన, 24న ఏవోబీ వద్ద ఒక రోజు ధర్నా, అక్టోబర్ 1 నుంచి పోర్టు ఆస్పత్రి వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వి.రామలింగేశ్వరరావు, జక్కన్న సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కలిగి ఉన్న యువకుడి అరెస్ట్

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న యువకుడిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం పెదబయలు ప్రాంతానికి చెందిన బాల గంగాధర్ తిలక్ (24) గంజాయి తీసుకొచ్చి పిఠాని దిబ్బలో విక్రయానికి ప్రయత్నిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి టూటౌన్ ఎస్ఐ శంకరరావు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 23 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు కృష్ణమూర్తి మృతి


యెండూరి కృష్ణమూర్తి (ఫైల్)

దాబాగార్డెన్స్: గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు, భగవద్గీత ప్రచారకుడు యెండూరి కృష్ణమూర్తి (94) సోమవారం కన్నుమూశారు. నగరంలోని రామ్‌నగర్ రోడ్డులో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పాతనగరం ఏరియాలో భగవద్గీత కోసం ఏర్పాటు చేసిన శ్రీగీతా ప్రచార సమితి ద్వారా గత 50 ఏళ్లకు పైగా ఆధ్యాత్మిక సేవలందించారు. ద్వారకానగర్‌లో గల వారి కుటుంబ సభ్యుల స్వగృహం నుంచి కాన్వెంట్ జంక్షన్‌లో గల హిందూ శ్మశాన వాటికలో సాంప్రదాయ రీతిన అంత్యక్రియలు జరిపారు. ఆయన అకాల మృతికి శ్రీగీతా ప్రచార సమితి అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సమితి ఉపాధ్యక్షుడు పి. జగన్‌మోహన్‌రావు, కార్యదర్శి ఎం. వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్ సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు కృష్ణమూర్తి మృతికి సంతాపం తెలిపారు.

త్రిముఖి ఆలయంలో పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లో గల త్రిముఖ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతికి 108 కళశాలతో కళశ పూజ చేశారు. ఉదయం పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద గురునాథ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ టి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సిద్ధిబుద్ధి సమేత వినాయకుని కల్యాణం మంగళవారం నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నల్లమిల్లి వెంకటరెడ్డి, శాంతి దంపతులు, కమిటీ సభ్యులు ఎం.ఎస్.ప్రకాశరావు, బి.కె.నాయుడు, శంకరనాయుడు, సత్యనారాయణ, వెంకటలక్ష్మి, శైలుకుమారి, శ్రీదేవి, కోటేశ్వరమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్ సత్యం జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న శ్రీ వరసిద్ధి వినాయక పూజా మహోత్సవాల్లో భాగంగా సోమవారం మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఆర్గనైజర్ కోన గోవిందరావు ఆధ్వర్యంలో ఇక్కడ పూజలు చేశారు. ఉత్సవాలు 22న కలశ ఉద్వాసనతో పూర్తవుతాయన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 17న లక్ష్మీ గణపతి హోమం, 18న విజయ గణపతి హోమం, 19న చండీ హోమం, 20న కుంకుమార్చన, 21న పూర్ణాహుతి నిర్వహిస్తామని తెలిపారు. 18న భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తామన్నారు. విగ్రహ దాత సంపంగి శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ దేవస్థానంలో మహా అన్నదానం


సీఎంఆర్ సంస్థల అధినేత రమణను సత్కరిస్తున్న ఈవో శిరీష, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ చోళన్ తదితరులు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల శ్రీ సంపత్ వినాయగర్ ఆలయ ఆవరణలో నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా సోమవారం 2 వేల మంది భక్తులకు మహా అన్నదానం చేశారు. మధ్యాహ్నం దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఉత్సవాలలో పాల్గొన్న సీఎంఆర్ సంస్థల అధినేత మవూరి వెంకటరమణను ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది జి.గోవిందరెడ్డి, ప్రధాన అర్చకుడు మోహన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


శాంతి ర్యాలీలో పాల్గొన్న పెద్దలు, చిన్నారులు

సీతంపేట : ఈద్ ఏ మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రవక్త మహమ్మద్ రసూలుల్లాహ్ జయంతి సందర్భంగా శాంతి ర్యాలీలు నిర్వహించారు. అక్కయ్యపాలెం, ముస్లిం తాటిచెట్లుపాలెం, చిన్నూరు, పెద్దూరు ప్రాంతాల్లో వేడుక జరుపుకున్నారు. మసీదులు, దర్గాలలో ప్రార్థనలు చేసి శాంతి ర్యాలీ ద్వారా వన్‌టౌన్‌లోని హజ్రత్ ఇషాక్ మదినా ఔలియా దర్గాకు వెళ్లి ప్రార్థనలు చేశారు. అక్కయ్యపాలెం చిన్నూరు, పెద్దూరులో గల మసీదుల పెద్దల ఆధ్వర్యంలో ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెంలోని యాసిన్ మసీదులోని మదర్సా విద్యార్థులు శాంతి ర్యాలీ నిర్వహించారు.

మర్రిపాలెం : జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్ – ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో ఈద్ మిలాద్ ఉన్ నబి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఫజర్ నమాజ్ ఆచరించిన ముస్లింలు ఖురాన్ పఠించారు. అనంతరం కోట వీధి ఇషాక్ మదీనా వలి దర్గాకు చేరుకుని చాదర్ సమర్పించి దావత్ నిర్వహించారు.

వైభవంగా దుర్గా గణపతి తిరువీధి

సీతంపేట : వినాయక నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా సీతంపేటలో గల దుర్గా గణపతి ఉత్సవ మూర్తుల తిరువీధి మహోత్సవం సోమవారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. సిద్ధిబుద్ధి సమేత దుర్గా గణపతిని ప్రత్యేక అలంకరణలో మేళ తాళాలతో పల్లకీపై పురవీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ఆయన కుమార్తె శ్యామల దీపిక, ఉత్సవ కమిటీ ఛైర్మన్ సారిపిల్లి గోవింద్, ఆలయ ఈవో జి.వి.రమాభాయి పల్లకీ మోసి తిరువీధి మహోత్సవాన్ని ప్రారంభించారు. స్థానికులు, భక్తులు, యువత పల్లకీ మోసేందుకు పోటీపడ్డారు. సీతంపేట కూడలిలో ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు గురుద్వారా, గొల్లవీధి, గణేష్‌నగర్, కనకమ్మ ఆలయం, రాధాకృష్ణ మందిరం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. అడుగడుగునా భక్తులు టెంకాయలు కొట్టి హారతులతో దుర్గా గణపతికి నీరాజనాలు అర్పించారు.

సినిమా పరిశ్రమ వైజాగ్ వస్తుంది


సినిమా ట్రైలర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వంశీ

దాబాగార్డెన్స్: విశాఖపట్నం చిన్న సినిమాలకు హబ్‌గా మారుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సినీ పరిశ్రమ విశాఖకు వస్తుందని, ఆ దిశగా తాము ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. మన్యం ధీరుడు సినిమా ట్రైలర్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం ధీరుడు సినిమా అద్భుతంగా ఉందన్నారు. సినిమా నిర్మాణంతో పాటు అల్లూరి సీతారామరాజు పాత్ర పోషించడం సాహస మన్నారు. కచ్చితంగా ఈ సినిమాని అందరూ ఆదరించాలని, మరిన్ని మంచి సినిమాలు సత్యనారాయణ నిర్దేశకత్వంలో రావాలని వంశీ ఆశించారు. నిర్మాత, అల్లూరి సీతారామరాజు పాత్రధారి ఆర్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఇష్టపడి ఈ సినిమా తీసానని, ఇందులో రెండు పాటలు కూడా తాను పాడినట్టు చెప్పారు. సహజ లొకేషన్లలో ఈ సినిమా తీసినట్లు తెలిపారు. టెక్నాలజీతో పాటు సహజత్వానికి ప్రాధాన్యత ఇచ్చి షూటింగ్ చేశామన్నారు. కార్యక్రమంలో సంఘ సేవకుడు బీవీ రామ్, రంగసాయి నాటక గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, బిల్డర్ సునీల్, కోరుకొండ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి పోరాటాలకైనా సిద్ధం


దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు

అగనంపూడి: విశాఖ ఉక్కును పరిరక్షించుకోవడానికి ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో మంగళవారం చేపట్టిన 1313వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. దీర్ఘ కాలంగా ఆందోళనలు, ఉద్యమాలు, రాస్తారోకోలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వ పెద్దలు కనీసం చలించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వంలో కదలిక తీసుకురావడానికి ఎలాంటి పోరాటాలకైనా, త్యాగాలకైనా సిద్ధమే అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు మసేన్‌రావు, డొక్కా నరసింగరావు, కె.రాజబాబు, సాంబశివరావు, జి.రాజు, డేవిడ్, సలాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.